# వ్యర్థ జీవి



శ్రీ కప్పగంతుల సత్యనారాయణ

డాక్టరు శివరామయ్యకి ఇప్పుడు చెన్నపట్టణంలో వున్న పేరు రెండో డాక్టరుకి లేదు. అతను సొంతగా ఒక నర్సింగు హోము పెట్టి, దానిని సాధారణమైన హాస్పిటలు కంటె బాగానే నిర్వహిస్తున్నాడు. అసిస్టెంట్లని కూడా పెట్టుకొని, వంతుప్రకారము డ్యూటీలు నిర్ణయిస్తూ, చాలా జాగ్రతగా ప్రాక్టీసు సాగించుకుంటున్నాడు. నర్సింగు హోము ఎగ్మూరులోనూ, నివాసము మాంబళములోనూ అవడంచేత, అతని కుటుంబ విషయాలు అసిస్టెంట్లకి యే మాత్రమూ తెలిసేవి కావు. మంచి నిపుణుడని పేరూ, దిట్టమయిన ఆదాయమూ వస్తోంది కాని, అతను ఫలాని వూరివాడనీ, కులగోత్రాలు యివిఅనీ కూడా ఎవరికీ తెలియదు. మనిషిమాత్రం ఒంటరిగా కూర్చున్నప్పుడు, చూసి కనిపెట్టి నట్లయితే వాల్చిన మొహంలో యేవో విచారరేఖలు మాత్రం పొడగడతాయి.

సౌహార్ద్రమూ, సౌమ్మదీ, నయత్వమూ అతనిలో మూర్తీభవించాయి.

అసిస్టెంటు నారాయణమూర్తి, కొన్ని మాసాల క్రిందటనే విద్యార్థిదశను సొంతము చేసికొని అనుభవం కోసము శివరామయ్య దగ్గర చేరాడు. స్వభావముచేత నారాయణమూర్తి కొంచెం కుతూహలం కలవాడు. ఇరవై మూడోయేడు వచ్చేదాకా పుస్తకాలు తప్ప మరేమీ చూడనందువల్ల, ప్రపంచానుభవం అతనికి చాలా తక్కువ. ఏమనిషిని చూసినా, ఏమాట విన్నా అతనికి అయోమయంగా వుండేది. ఆస్పత్రికి సరిగ్గా పదింటికి వచ్చి సాయంత్రం 5-30కు వెళ్లిపోతున్న డాక్టరు అతనికి పచ్చి వెలక్కాయ అయినాడు.

*　　　*　　　*

సాయంత్రము 5-30 కావచ్చినది. డాక్టరు శివరామయ్య, మళ్లీ ఒకసారి ఆ వార్డులన్నీ తిరిగి, రోగుల్ని అందర్నీ కదిలించి, యింటికివెళ్లే ప్రయత్నంలో వున్నాడు. సాయంత్రము నాలుగు గంటలికి వచ్చి, రాత్రి పదింటిదాకా డ్యూటీ చెయ్యవలసిన నారాయణమూర్తి బయటి హాలులో ఆలోచిస్తూ పచారు చేస్తున్నాడు. శీతకాలం కావడంచేత కనుచీకటిగా వుంది.

'డాక్టరుగారు ఉన్నారా, అండి?' అన్న సన్న బలహీనమైన కంఠము అతని ఆలోచనల్ని అరికట్టింది. ఉలికిపడి, రెండుకళ్లూ యెత్తి చూశాడు. 'డాక్టరుగారున్నారా, లోపల?' మళ్లా అదేధ్వని. ఎదురుగా వచ్చి నిలుచున్న శుష్కించిపోయిన స్త్రీ శరీరము పలికింది. ఆ మాటల్ని ఆస్త్రీ ధరించిన మాసిపోయిన తెల్లచీరా: నల్లరవికా, ఎలక్ట్రిక్ దీపపు వెలుతురులో మాపుతగ్గి, కొంచెం కాంతిగా అగుపించాయి. పాలిపోయిన ఆమె, దేహం, దైన్యాన్ని వ్యక్తపరుస్తూన్న ఆమె మొహమూ, అనుభవంలేని ఆ కుర్రడాక్టరుకి యేమీ అవగాహన కానియ్యలేదు.

నిదానంగా ఆమెకేసిచూసి 'ఎందుకు?' అన్నాడు.

ఆమె:—ఆయన దగ్గరకే నన్ను తీసుకువెళ్లండి; మీకు పుణ్యముంటుంది.

నారా:—ఏమిటి - ఎందుకు ?

ఆమె:—అయన్ని చూడాలి. నేనాయన్ని ఎరుగుదును.

నారా:—చెప్తాను ఆయనతోటి.

అని ఆతను డాక్టరు దగ్గిరికి వెళ్లాడు; డాక్టరు మొహంలో ఏమీ భావం అతనికి పొడగట్టలేదు. డాక్టరు మాత్రం ఆలోచించాడు.

'ఎందుకూ, రమ్మను. అడుగుదాము - ఇదొక కొత్త విషయమే, ఇంతవరకూ -' డాక్టరు ఏమాటా చాలా త్వరగా పైకి అనేసేవాడు కాదు; అందులో, తాబేదార్ల దగ్గర ఎంతవరకు మాట్లాడాలో అతనికి తెలుసును. నారాయణమూర్తికి యిలాంటి సంఘటనలు చూడటమంటే సరదా. ప్రొసరి చేసుకుంటూ వెళ్లి 'రమ్మన్నారు, డాక్టరుగారు' అంటూ ఆమెను తీసికొని వెళ్లి డాక్టరుకి యెదురుగా నిలిపి, తను ప్రక్కగా నిలుచున్నాడు. వీళ్లు వెళ్ళే సరికి, బేసినులో చేతులు కడుక్కుంటూ వున్న డాక్టరు, ఆమెకేసి పరకాయించి చూశాడు. ఆమె రూపం యెప్పుడో తను యెఱిగిన ఏమనిషి రూపంలోనో ఒక ఛాయ అని, అతడనుకున్నాడు.

'ఏమి కావాలమ్మా నీకు ?' అన్నాడు డాక్టరు. ఆమె రెండుచేతులూ జోడించింది. కళ్లు నీళ్లతో నిండాయి. పెదిమలు చలించాయి. మనిషే ఒకసారి ముందుకీ వెనక్కీ కంపించిందేమో కూడాను.

'అయ్యా !......మీ కాళ్లు పట్టుకుందామని వచ్చాను. మీరే నాకు దిక్కనుకున్నాను. ఛండాలురాలి -' అన్నదామె.

డాక్ట:—ఏమికావాలి ? (కొంచెం మందలింపుగా)

ఆమె:—తమదయ. మీరు దప్ప నాకిక దిక్కులేదు. తమర్ని నమ్మి యిక్కడకు వచ్చాను.

డాక్ట:—నాకర్థము కాలేదు. మా ఆస్పత్రిలో వుంటావా ?

ఆమె:—అవసరమని మీరు చెపితే; నన్నేమి చేయమంటె అదే చేస్తాను. నన్ను సంపూర్తిగా మీ స్వాధీనము చేసుకుంటున్నాను.

ఆమెఅన్న మాటలకి డాక్టరుకి కొంచెం అసహ్యం వేసిందేమో, అనోమాదిరిగా నిశ్వాసించాడు. అసిస్టెంటు నారాయణమూర్తి చెవులు రిక్కించుకొని వింటున్నాడు. అతనికి యిదిఅంతా అయోమయంలాగ వుంది. ఎవరికి ఏమి తేల్తుందో చూదామని అతనికోరిక.

ఆమె:—బీదదాన్ని, అపరాధినీ అయిన నాకు మీరే దిక్కని తోచింది. లోకమంతా తమ మంచిపేరు

డాక్ట:—అదంతా అనవసరము. ఆస్పత్రిలో చేర్చుకుంటాను. నా సాధ్యమైనంతవరకూ వైద్యము చేస్తాను.

ఆమె:—మీ యిష్టము. యీ అవస్థలో, నేను చేసిన పాపాలకీ నేను పడిన బాధలకీ ముక్తిమీదే.

డాక్ట:—అబ్బే...అలాంటి మాటలన్నీ వద్దు. నారాయణమూర్తి !

నారా:—సర్.

డాక్ట:—ఎగ్జామినేషన్ రూములోకి తీసుకొనిపద యీమెను.

'యస్' అని ఆమెను తనవెంట తీసుకొని వెళ్లాడు నారాయణమూర్తి.

ఆమె కంఠధ్వని, డాక్టరుకి తను యెప్పుడోవిన్న కంఠధ్వనిలోని భాగమేమో ననిపించింది. అతను ఆలోచించాడు. 'ప్చ్' అని అతని పెదవులు మాత్రము చ్ఛరించాయి.

ఎగ్జామినేషన్ రూములోకి వెళ్లి ఆమెను పరీక్షచేసి, వెనీరియల్ వార్డులో, నాలుగో బెడ్ యిచ్చెయ్యి. ప్రిస్క్రిప్షను యిస్తాను, ఛాష్టపంపించు నర్సుచేత అని చెప్పి, తాను చెయ్యవలసిన పనులు పూర్తిచేసుకొని వెళ్లిపోయాడు డాక్టరు.

నారాయణమూర్తికి, డాక్టరుతోటి ఆమెఅన్న ప్రతి మాటలోనూ యేదో గూఢార్థముగా వుందనీ, పూర్వగాథను స్మృతికి తెచ్చేభావంతో మాట్లాడుతోందనీ అనిపించింది. డాక్టరుచెప్పే జవాబు లన్నిటిలోనూ, ఆమెను డాక్టరు అర్థము చేసికోనట్టు తోచింది.

ఆమెస్థితి రోజురోజుకూ చెడిపోవడ మారంభించింది. డాక్టరు, ఆమెను అందరు రోగులతోటీ సమంగానే సమమైన ఆదుర్దాతోటే చూస్తూ మందిస్తున్నాడు. అతను

వచ్చినప్పుడల్లా ఆమె యేదో తప్పుచేసి పశ్చాత్తాప పడుతూన్నట్టు మాట్లాడేది. అన్నిటికీ డాక్టరు అంటీ అంటనట్లు సమాధానము చెప్పేవాడు; ఆమె పొగడటము ఆరంభించినప్పుడు వాదించేవాడు; ఆమె ఆరోగ్యము విషయమై మాత్రం అతి జాగ్రత్తగా, అమిత ఆపుద్ధాతోటి పనిచేశేవాడు. ఆమె శరీరస్థితిని విచారించడంలో బహు శ్రద్ధగా వుండేవాడు. అడగవలసింది బహుశ్రద్ధగా ఆమెను అడిగేవాడు. ఆమె యెందుకో, కన్నీళ్లు ధారలు కట్టేటట్లు యేడ్చేది. అతను యేడవవద్దనేవాడు.

డాక్టరు అందరు రోగుల్నీ వరుసగా చూసేవాడు; ఆమెను చూసిన తరువాత చూడవలసినవాళ్లు వున్నా, తన గదిలోకి వెళ్లి రెండుమూడు నిముషాలకి బయటికి వచ్చి, మళ్లా తక్కినవారిని చూసేవాడు. గదిలోకి వెళ్లి యేం చేశేవాడు? యేదో ఆలోచించేవాడు. తక్కినవారిని గురించి కాక, ఆమె విషయమై అతను చూపిస్తూవున్న శ్రొత్తపద్ధతి యిది వొక్కటే. నారాయణమూర్తికి యిదే వింతగా తోచేది. గదిలోకివెళ్లి డాక్టరు సమన్వయము చేసుకొనే ఆమె మాటలలోని భావము యేమిటి? ఆమె యెవరో డాక్టరుకి తెలుసునా తెలియదా? ఆమె ఎవరు? ఆమెకీ డాక్టరుకీ సంబంధము యేమిటి? ఇది నారాయణ మూర్తికి అప్పుడు పట్టుకున్న సంధిగ్ధావస్థ కాని డాక్టరు గారిని ఆ విషయమై అడుగుదామని......! అమ్మ బాబో!! అంత సాహసమే! మొదటినుంచీ డాక్టరు, తన అసిస్టెంట్లకి చనువన్న మాట చవి చూపించినవాడు కాదు. ఆ డాక్టరు మొహంలో వున్న శక్తియేమిటో కాని, అతని దగ్గిర అనవసర ప్రశంస తేవడానికి ఎవరికేనా జంకే.

౨

ఒకరోజున డాక్టరు శివరామయ్య మామూలు ప్రకారం ఆమె దగ్గిరకివెళ్లి ఛార్టు తీసిచూస్తున్నాడు. అప్పుడు డ్యూటీలోవున్న నారాయణమూర్తి డాక్టరు వెనక్కాల నిలబడి వున్నాడు. అర్ధనిద్ర (Sub-Concious State) లోవున్న ఆమె కళ్లు తెరిచి డాక్టరు కేసిచూసింది. కొంచెం సేపు నిదానంగా చూసింది—బలహీనంగా, సన్నగా అంది.

ఆమె:—డాక్టరుగారూ, నేను బ్రతుకుతానా?

ఆమె మాటలలోవున్న దైన్యానికి నారాయణమూర్తి చాలా జాలిపడ్డాడు.

డాక్టరు:—చూడాలి. (చాలాకష్టముతో అన్నాడు ఆమాట)

ఆమె:—నన్ను బ్రతికించరూ; నాకు బ్రతకాల్ని వుంది. బ్రతకాల్నని లేనివాళ్లు లేరు కాని, ఆ బలహీనతలో, అంత దీనంగా ఆమె చెప్పిన తన కోరికకు, డాక్టరు నిలువునా నీరైపోయాడు.

డాక్ట:—నాచేతనైనంతవరకు ప్రయత్నిస్తాను.

ఆమె:—ఈ రోగము చంపగలదా అసలు?

డాక్టరు:—చంపడానికి రోగమే కానాలా! చంపే రోగమువచ్చి బ్రతికిన వాళ్లు లేరూ!

ఆమె:—మీదయ. నన్ను బ్రతికించండి. నేను చేసిన పాపానికి పశ్చాత్తాప పడుతున్నాను. దానికి తగిన శిక్షకూడా అనుభవించేశానేమో, ఇంక, నేను బ్రతికితే, మీపా—

డాక్టరు:—అలాంటివేమీ చెప్పవద్దు. నీ ప్రాణం నా ప్రాణమంత విలువగలదానిగా జూసి, నేను మందు వాడుతున్నాను.

ఆమె:—నిజంగానే!

ఆమె కళ్లు ఒక్కసారి ప్రజ్వరిల్లాయి తృప్తీ, సంతోషమూ ఆ కళ్ళలో తాండవించాయి. ఇదంతా నారాయణ మూర్తికి పెద్దగొడవ. ఆమెదైవమూ, డాక్టరు చూపించే కేవలమూ అంటీ అంటని తనమూ అతనికేమీ అవగాహన కాలేదు. వాళ్లిద్దరి సంభాషణావింటూ అలాగే వుండిపోయాడు. డాక్టరు, ప్రిస్క్రిప్షనులో యేదో మార్పుచేసి తన గదిలోకి వెళ్లిపోయాడు. నారాయణమూర్తి, ఆమె ఛార్టును తీసిచూశాడు. ప్రిస్క్రిప్షనులో డాక్టరుచేసిన మార్పు అతనికి అర్థమయింది; ఛార్టూ, ప్రిస్క్రిప్షనూ,

ఆంగ్లోయిండియను నర్సుకి యిచ్చి అతనుకూడా అవతలికి వెళ్లాడు.

ఆరాత్రి పదిగంటలదాకా డ్యూటీ నారాయణమూర్తిదే. సాయంత్రము ఆరుగంటలయేసరికి అతడు ఆమె దగ్గిరకి వచ్చాడు. ఆమె మేలుకొనే వుంది. కుర్చీలాక్కొని ఆమె మంచందగ్గిరసా కూచున్నాడు. డ్యూటీనర్సుకి ఏదో అనుమానం వేసి గుమ్మంపక్కగా నిలబడి ఓరగంట చూస్తోంది.

ఆమెను పలకరిద్దామని రెండుమూడు సార్లు నాలుక మెదిపాడు కాని ధైర్యం లేకపోయింది.

ఎలాగో సాహసించి 'మీది అసలు ఏవూరు?' అన్నాడు.

ఆమె:—సంగతి తెలుసుకో దగ్గవారు నాకు యెవరూ లేరు. ఎవరో వొకరువుంటే వారు తెలుసుకుంటూనే వున్నారను కుంటాను.

నారా:—అయినా, మీది యేవూరో చెప్పకూడదూ!

ఆమె:—నా వూరువల్ల యేం లాభమూ, అంతమాత్రాన నాకథ తెలుస్తుందా మీకు;



ఆమె:—(విరక్తితో చిరునవ్వు నవ్వి) ఏమీ!

నారా:—ఊరికేనే, తెలుసుకుందామని మీవాళ్లు ఎవళ్లేనా వుంటే తెలియబరుద్దామని—

ఆమె:—ఏమీ, నేను చచ్చిపోతానా యేమిటి?

నారా:—అహాఁహఁ, అదికాదు; కాకపోతే మాత్రం తెలియబరచ కూడదా యేమిటి?

నారా:—పోనీ అంతా చెప్పరాదూ; నేనేమీ పర మందిలోనూ అంటానా?

ఆమె:—నేను బ్రతుకుతానా, బ్రతకనా?

నారా:—...............

ఆమె:—మీరు ముందు ఆ సంగతి చెప్పండి.

నారా:...కొంచెం సందేహమే.

ఆమె:—ఏమిటీ, నేను బ్రతకనూ?

నారా:—ఈ జబ్బుచేసి బ్రతికినవాళ్లు వ్రేళ్లమీద లెక్క పెట్టవలసినవాళ్లు.

ఆమె:—ఊఁ...ఉహూఁ.

ఆమె కొంచెంసేపు ఆలోచించింది. తన కడుపుకేసి తన చేతులకేసే చూసుకుంది. ఒక్కసారి నిట్టూర్పు విడిచింది.

నారాయణమూర్తి చేసిన పొరపాటు గ్రహించాడు. చావు మంచముమీదనున్న రోగికి చావుసంగతి చెప్పడం కంటే తెలివి తక్కువలేదు. కాని ఆతని కుతూహల మలాంటిది. రోగిని ఎక్కువసేపు మాట్లాడ నియ్యకూడదనీ, ఆలోచించడానికి అవకాశ మియ్యకూడదనీ అతనికి తెలుసును కాని ఆ ఆదుర్దా అలాంటిది.

ఆమె:—మీకు వినాలున్నందా—

నారా:—అవును. కొంచెం కొంచెం చెప్పండి. తొందరలేదు.

ఆమె:—అలాగే. ఊఁ.

మా నాయన, ఆయన పేరుతో పనిలేదు, విశాఖ పట్టణంలో కొంచెం పలుకుబడీ, రాబడీవున్న ప్లీడరు, ఆయనకు నేను వొక్కతెనే కూతుర్ని. నన్ను చాలా ముద్దుగా పెంచారు. సెకండుఫారము దాకా చదివాను నేను. నా పదకొండో యేటనే నాకు పెళ్లిఅయింది. నా వివాహము నాటికి నాభర్త, ఎఫ్. ఏ. చదువుతూ వున్నారు. పెళ్లి అయిన క్రొత్తలో ఒకటి రెండేండ్లు మామూలుగా అల్లుళ్లకి జరిగే మర్యాదలూ, ఆనమాయితీలూ జరపడానికి మా ఆయన్ని తీసుకొచ్చేడు మానాన్న. ఆయన బి. ఏ. చదువుతూన్న రోజులలో నేను పెద్దమనిషి నయాను. ఇంకా యేదో పెద్దచదువు చదవాల్ననీ, ఆ పరీక్షలు అయ్యేదాకా కార్యం చేసుకోమనీ, అత్తవారింటి దగ్గరనుంచి కబురు వచ్చింది.

ఆ.........నాయనా, మీరు నాకన్న చిన్నవారు. నా తమ్ముడికి చెప్పినట్టు చెపుతున్నాను—

కామము మహాచెడ్డది. యుక్తా యుక్తాలుతోచనియ్యదు. తోసేస్తుంది గోతిలోకి.

మాయింటి ప్రక్కనే ఒక మహాపాపి వుండేవాడు. వాడు కిచకిచలు పెట్టే యౌవనములోకి దిగుతూ వున్న నన్ను చూశాడు. వలవేశాడు. ఒకసారికి పదిసార్లు నాకేసి చూసేవాడు; నాకేసి వాడు నాలుగైదుసార్లు చూడడము, నన్ను వాడికేసి చూసేటట్టు చేసింది. ఒకర్ని వొకరు చూసుకొనేవాళ్లము. ఒళ్లు తెలియని కామం ఆవేశించింది నన్ను. కాని అడదాన్ని కనక సాహసించలేక పోయాను. వాడే, నాలుగోనాడో అయిదోనాడో దాసీదానిచేత కబురు పంపించాడు. నిజానికి ఆ కబురు ఎప్పుడు వొస్తుందా అని యెదురు చూస్తూవున్నాను నేను. వెంటనే అంగీకరించాను.

* * *

సాయంత్రము మా నాయనగారు క్లబ్బులో వుండేవేళా, మా అమ్మ వంట చేసుకునేవేళా, వీలుచేసుకుని మా పెరటి దారిని దొడ్లోకి రమ్మన్నాను. సాయంత్రము వెళ్లి పెరటి తలుపుతీసి వుంచాను. మా పెరటినిండా బోలెడు చెట్లున్నాయి. అది ఒక చిన్నతోటలా వుంటుంది. సాయంత్రం అనుకున్న వేళకి వాడు వచ్చాడు. నన్ను యేంజేశాడో కాని, ఆ సాయంత్రం మాత్రం, పుట్టినతరువాత అంత ఆనందం యెన్నడేనా అనుభవించానా, అనిపించింది. నా మొహమంతా ఎర్రబారింది. ఇంట్లోకి వచ్చి అద్దం చూసుకుంటే, ఏదో క్రొత్తఅందం నాకు ప్రాప్తించినట్లయింది. నా మొహం నేను చూసుకోలేక పోయాను. మా అమ్మతోటీ, మా నాన్నతోటీ ఆరోజున ముఖాముఖీ మాట్లాడలేకపోయాను. ఆ రాత్రెల్లా వాడు నాదగ్గరవుంటే బావుండుననిపించింది. 'మళ్లీ రేపు యిదేవేళకి' అని వాడు నాతోచెప్పి వెళ్లిపోతూవుంటే తలకాయవంచుకొని 'ఊఁ' అన్నాను. మర్నాడు వచ్చాడు. ఆరోజు వాడిమొహమే చూడలేక పోయాను. కాని, వాడు నన్ను విడవలేదు.

* * *

మూడోరోజు, నాలుగోరోజు, అయిదోరోజు, యిలా పదిరోజులు గడిచాయి. నాకు తృప్తికలగలేదు. ఛీ

రోజంతా వాడి దగ్గరవుండాలని కోరికగావుండేది. ఎలా సాగుతుంది. మా నాన్న చంపెయ్యడూ, వాడితోటి పదిసార్లు ఆమాటచెప్పాను. ఆకోతి, ఆవెధవ, ఆపరమ దుర్మార్గుడు నన్ను వీపు మెల్లిగా నిమిరి 'ఏలాగో నువ్వే చెప్పు!' అనేవాడు. చాలాసేపు ఆలోచించాను. నా తృష్ణ బలవత్తరమైపోయింది.' చివరికి, ఎక్కడకేనా పారిపోదామన్నాను. వాడిదగ్గర ఆట్టే డబ్బులేదన్నాడు. నా వంటిమీద రెండువేలు ఖరీదుచేసేనగలున్నాయి. పోదాంపదమన్నాను. వాడు సరేనన్నాడు. ఇంకేముంది. ఇద్దరమూ కలసి ప్రయాణంకట్టాము. ప్రయాణంనాడు మా నాన్న పర్సులోవి పాతికరూపాయలు దొంగతనంగా తీశేశాను,

* * *

అర్ధరాత్రివేళ దొంగతనంగా గుర్రబ్బండి కట్టించుకొని వాత్తేరువచ్చి, తెల్లవారుఝాము రైలులో సామర్లకోటకి సెకండుక్లాసు టిక్కెట్టు కొని యెక్కాము. ఆ రైల్లో వాడు నాకు చెప్పినమాటలూ, నన్ను అనుభవింపజేసిన సుఖమూ,—నేనుచేసేపనీ మహా యోగ్యమనిపించాయి. ఇద్దరమూ సామర్లకోటలో దిగాము. సత్రంలో బస యేర్పాటుచేశాడు. నా మెళ్లో కాసులపేరు తీసియిచ్చాను వాడికి. వెళ్లి యెనిమిదివందలకి అమ్ముకువచ్చాడు. సినీమాలూ, నాటకాలూచూస్తూ, అమితవిలాసంగా పదిహేనురోజులు గడిపాము. నాదగ్గర యాభైరూపాయలున్నాయి. తక్కినడబ్బు యేడువందలూ వాడిదగ్గరనే వుంది. పదహారో రోజు తెల్లవారుఝామున, నేను నిద్రపోతూండగా, తనదగ్గిరవున్న డబ్బుతో మాయమయాడు. రెండురోజులు గడిచాయి. వాడిజాడ తెలియలేదు.

* * *

సత్రంలో ప్రక్కన కిల్లీ దుకాణంపెట్టిన వాడొకడు, మేము ఆసత్రంలో దిగినదిమొదలు నన్ను సాభిప్రాయంగా చూస్తూవుండేవాడు; రెండురోజులు నాతోవచ్చినవాడు లేకపోయేటప్పటికీ, ఆకిల్లీకొట్టువాడు మెల్లిగా నాప్రాపు కోరాడు. నా యౌవనము, కోరివచ్చిన మొగాణ్ణి తృణీకరించలేక పోవడము సరికదా, శిరసావహించే స్థితిలోవుంది. ఇంకేమి, వాడిచేతిలో కీలుబొమ్మనయాను. సత్రంలో ప్రక్కనున్నవాళ్లంతా నన్నుచూసి యేదో గుసగుసలాడుతూండేవారు. నాకు చిన్నతనంగానే వుండేదిగాని, అది గమనించేటంత శ్రద్ధ నన్నుతీసికోనియ్యలేదు నా కామం. ఇలా ఒక వారంరోజులు వెళ్లిపోయాయి.

* * *

తొమ్మిదో నాడో పదో నాడో, ఆసత్రంలో మా నాన్న ప్రత్యక్షమయాడు. నేను ఆ సత్రంలో అవినీతికరంగా కాపురమున్నానని ఆయనకెవరో వుత్తరం వ్రాశారుట. నాకు తరువాత తెలిసింది—ఆయన నాకేమీ చెప్పలేదు. ఇంటికిపోదాము రమ్మన్నాడు. నేను ప్రయాణమయినాను. రైలులో కాని, సత్రంలో కాని ఆయన నన్నేమీ అడగలేదు. ఆయనముఖం నేను చూడలేకపోయాను.

ఇంటికిచేరాక మా అమ్మమాత్రం ఎక్కడికివెళ్లావని అడిగింది. నేను చెప్పలేదు. ఏవేవో సణుగుకొంటూ కళ్లనీళ్లు పెట్టింది. ఆమె అలాచేసినప్పుడల్లా నేను ఆమెదగ్గిర్నుంచి లేచిపోయేదాన్ని. రెణ్ణెల్లదాకా నేను మానాన్నకంటబడలేదు. ఆయన యెప్పుడూ నన్ను చూడగోరనూలేదు. కాని, ఇంట్లో బంట్రోతులూ దాసీలూ నన్ను చులకనగ చూస్తేసినట్టు తోచేదినాకు. నేను మొదట లేచిపోయినవాడు మాయింటిప్రక్క లేడని తెలిసింది. ఆ ఆరువందలతోటీ, ఎక్కడికో పోయివుంటాడు. ఇహ మళ్లీ వాడు నాకంట యిప్పటివరకూ పడలేదు. రెండుసంవత్సరాలు, ఆవరసని నేను మళ్లా మగవాసన లేకుండా వుండిపోయాను—వుండవలసివచ్చింది. అతి కష్టముమీద వున్నాను.

ఇంతలో కార్యం చేసుకుంటామని మా అత్తారియింటినుంచి వార్తవచ్చింది. మా నాన్న సర్వం సిద్ధంచేసివేశాడు.

జరిగిపోయినదాన్ని మరిచిపోయారేమో నా తల్లిదండ్రులు—ఎలాగయితేనేమి, కార్యంచేసి అత్తవారింటికి పంపించివేశారు నన్ను

## 3

ఆమె మళ్లీచెప్పడానికి తన సత్వాన్నికూడ బెట్టుకొనే లోపల, నారాయణమూర్తి ఆమెకొక సోడా తెప్పించి యిచ్చాడు.

ఆమె చాలాసేపు ఆయాసపడింది.

ఆమె:—నా భర్తకి యింకా ఒకయేడాది చదువు మిగిలివుంది. ఆ యేడాదీ నేను ఆయనతోనే వున్నాను. చదువు అయినతరువాత ప్రాక్టీసు పెట్టారు ఆయన—

'ఏ ప్రాక్టీసు, ప్లీడరీయా, డాక్టరీయా?' అన్నాడు నారాయణమూర్తి చప్పున.

ఆమె:—అది చివరికి చెపుతాను. ప్రాక్టీసుపెట్టిన యేడాదిదాకా సంపాదనకూడా యేమీ పొడచూపలేదు. తరువాత వచ్చీరాని ఆదాయముండేది. నా పెనిమిటిలో నాకు తగిన కామతృష్ణ కనిపించలేదు. ఆయన సాత్వికత్వాన్ని గ్రహించేజ్ఞానము నాకు లేకపోయింది. నన్ను ఆయన అర్థముచేసుకోనలేదు. పవిత్రురాలైన భార్యకి యివ్వతగిన స్థానము యిచ్చారు. నేను దాన్ని నిలుపుకోలేక పోయాను. నాచూపు వేరువైపు తిరిగింది. అయినా అతికష్టము మీద మూడు సంవత్సరాలు ఆయనతోటే కాపురం చేశాను. తరువాత మెల్లిగా, మా యింట్లోవుండే మోటారు డ్రైవరు చేతిలోపడిపోయాను. భర్తతో కాపురంచేస్తూ, వేరొకడితోటి కామం తీర్చుకోవడం నాకు చాలాయిబ్బందిగా తోచింది. ఆయింట్లోనుంచి యెప్పుడు బయటపడతామా అనిపించేది. అక్కడ జరుగుతూవున్న సమస్తసుఖములూ నాకు తృణప్రాయంగా కనిపించాయి. ఇంకొకచోటికిపోతే యెంతకష్టపడవలసివస్తుందో అన్న ఆలోచన తోచలేదు.

* * *

పర్యవసానం ఆ డ్రైవరుతోటి లేచిపోయాను. మళ్లీ మొదటిలాగే, మెళ్లోవస్తువులు అమ్మడం. తినడం మోటారు డ్రైవరు పనిచేసే, ఆ నీచకులస్థుడికి వున్నత గుణాలు యెలా వుంటాయి, త్రాగుడూ, చుట్టలూ అన్నీ వాడికి అలవాటె. డబ్బుయిచ్చేదాన్ని నేనప్పుడప్పుడు. వెనకాముందూ చూడకుండా వాడేశాడు. కొన్నిమాసములు అలాగే వాడితోటి వున్నాను, డబ్బు పూర్తికావచ్చింది. నాకు భయమేసింది. రెండుమూడుసార్లు డబ్బు అయిపోతోందని వాడితో ప్రస్తావించాను. అంతగా అయిపోతే ఉద్యోగముచేసి సంపాదిస్తాననేవాడు. వాడిమాటలు నమ్మాను. కాని తీరా అయిపోవచ్చేటప్పటికి వాడు చెప్పకుండా వెళ్లిపోయాడు. నాకు చాలా భయంవేసింది. తరువాత కొన్నాళ్లు ఒంటరిదాన్నే.

* * *

మరిరెండు నెలలకు కాఫీహోటలులో పనిచేసే ఒక నాయరికి, కేవలమూ తిండికోసం నాదేహాన్ని అర్పించాను, వాడితో వుంటూండగానే, అదివరకు నాలోవున్న రోగాలన్నీ ఒక్కసారిగా బయటపడ్డాయి. వాడుకూడా మంచమెక్కాడు. గతజీవితాన్ని ఒక్కసారి చూసుకుంటే, ఎంతతుచ్ఛంగా ప్రవర్తించానో నాకు బోధపడిపోయింది. రెండు మూడుసార్లు చచ్చిపోదామనుకున్నాను. కాని అంత ధైర్యం లేకపోయింది. చావుఅంటే ఎంతో భయమేసింది. నాకు దారితోచలేదు. నాకిక దిక్కూకూడా ఎవరూలేరు. నన్ను రక్షించకపోతారా అని యీ డాక్టరుగారి పాదాల దగ్గరికి వచ్చాను. బాబూ, యిదీ నాకథ. విని ఆనందించదగినది కాదు; కనికరించడానికా, అది వినేవాళ్ళమనసునుబట్టి వుంటుంది—'

* * *

ఏమిచెపుతాడో అని ఆమె నారాయణమూర్తిమొహం చూసింది.

నారా:—నీ కథఅంతా చెప్పావుకాని—

ఏమిటి మీ సందేహమన్నట్టుగా ఆమె కనుబొమలు ఎత్తిచూసింది.

నారా:—మీ భర్తది ఏంప్రాక్టీసు, అతనెవరో—

ఆమె:—ఎందుకూ, అప్రతిష్ఠ ఆయన్నికూడా చెప్పుకోడము, అయినా నేను చేసిన నీచానికి ఆయనకే అప్రతిష్ఠ పాపం!

నారా:—మరింకేమీ; చెప్పు ఫరవాలేదు చెప్పు.

ఆమె:—ఇప్పుడు కాదు; కానీండి.

నారా:—కాదు; చెప్పేసెయ్యి. నేను చెయ్యగల సహాయము ఏమయినావుంటే చేస్తాను చెప్పు.

ఆమె ఆలోచనలో పడిపోయింది.

నారా:—చెప్పు నిన్ను అవమానం చెయ్యడానికి కాదు నేనడగటం, చెప్పు. నాకు చాలా జాలిగావుంది పాపం.

ఆమె:—అయితే.........శివ

నారా:—............

ఆమె:—మీ డా.........

నా:—ఆఁ. అలాగే అనుకున్నాను కాని నమ్మలేక పోయాను. ఆఁ, హ్హ ఎంతపనీ ఆయనకు తెలుసా మీ రెవరో.

ఆమె:—చెప్పలేను.

నారా:—చ్చొ - చ్చొ. ఎంతపని! మీరు అధైర్యపడకండి. ఆయన చాలామంచివారు. జబ్బు నయమయ్యాక ఆయనకి అనుగ్రహం కలిగితే కలగవొచ్చు. చూద్దాం, మీరు అధైర్యపడొద్దు. కాస్సేపు నిద్రపొండి.

ఆమె సాలోచనగా పైకిచూస్తూవుంది. నారాయణమూ[illegible] ఆమె మొహంకేసి చూశాడు. కృశించిన ఆమెశరీరము ఒకప్పుడు మహా సౌందర్యములో వుందనీ, తేజోహీనముగావున్న ఆమెకళ్లు వొకప్పుడు జ్యోతిర్మయాలై వున్నాయనీ, పారిపోయిన ఆమె పెదవులు ఒకప్పుడు జగన్మోహనంగా వున్నాయనీ, ఆమె మొహమంతా, పశ్చాత్తాపాన్ని వెల్లడిస్తోందనీ ఊహించుకున్నాడు.

మెల్లిగా అక్కడనుంచి లేచి వెళ్లిపోయాడు.

* * *

మరునాటీవుదయం మామూలువేళకి, డాక్టరు శివరామయ్య వచ్చాడు. నారాయణమూర్తి వెళ్లి, ఆయనకి యెదురుగా కూర్చున్నాడు.

నారా:—సర్

డాక్ట:—ఏమి!

నారా:—ఆమె బ్రతుకుతుందాఅండి, పాపం!

డాక్ట:—ఏమి చెప్పలేము. ఇంకా రెండు మూడు రోజులు చూడాలి.

నారా:—ఎలాగయినా ఆమె బ్రతికితే—

డాక్ట:—మంచిదే; ఏమంత శ్రద్ధగావున్నావు;

నారాయణమూర్తికి చిన్నతనమయింది. ఆమెవిషయమై తగినజాగ్రత్త తీసుకోవాలనీ, డాక్టరుకి సంబంధించిన విషయమనీ, యెలా తెలియజెయ్యాలో అతనికి బోధపడలేదు.

రోజూ ఆమెవద్దనుంచి తనగదిలోకి వెళ్లి, డాక్టరు ఆలోచించడానికి కారణం, బహుశా ఆమె యెవరో డాక్టరు ఎరుగునా అని నారాయణమూర్తికి సందేహము.

నారాయణమూర్తిమాత్రం, ఆమె విషయంలో చాలా ఆదరణ చూపించేవాడు, అంతకన్న ఎక్కువ అతనూ యేమీ చెయ్యడానికీ వీల్లేదు ఆపరిస్థితుల్లో.

జబ్బుమాత్రం ఎక్కువై పోయింది. ఆమెజబ్బుతో నారాయణమూర్తికి అదుర్దా యెక్కువైంది. డాక్టరు శివరామయ్యకూడా తగిన ఆవేదన చూపించాడు.

మరణమంటె ఆమె ఎంతభయపడిందో, అంతత్వరగా ఆమెప్రాణాలు ఎగిరిపోయాయి.

* * *

నాలుగురోజులదాకా డాక్టరు మొహంమీద విచార రేఖలు వున్నాయి.

సాయంత్రంపూట నారాయణమూర్తీ ఆయనా మాట్లాడుతూ వున్నారు.

నారా:—మొన్న చనిపోయిన ఆవిడ సంగతి ఆవిడచరిత్ర అంతా నాకు చెప్పిందండి.

డాక్టరు నారాయణమూర్తి కేసి ప్రశ్నార్థకంగా చూశాడు.

నారా:—క్షమించండి ఆమె తమ—

'ఆఁ, అలాగా' అని డాక్టరు చప్పున అతనిమాటల్ని అడ్డుపెట్టేశాడు.

అతడు తలవంచుకొని 'She is a Pervert' అన్నాడు.